## క్లుప్తంగా

### నేటి నుంచి తిరునాళ్లు

**అశ్వారావుపేటరూరల్:** మండల పరిధిలోని వేదాంతపురం గ్రామంలో నేటి(ఆదివారం) నుంచి చిన్న కొర్రాజుల స్వామి వారి తిరునాళ్ల మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు తెలిపారు. ఈ మేరకు శనివారం తిరునాళ్ల పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో స్వామి వారి ఊరేగింపు, సోమవారం ఉదయం స్వామి వారి ఆలయ ప్రవేశం, ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కొలబియ్యం, 22వ తేదీన స్వామి వారికి మైలపట్నం, చంద్రపట్నం, స్వామి వారికి స్నానం, సరువులు, కొల బియ్యం, రాత్రి 12గంటలకు సరువులను కొండంగా ఏర్పాటు చేయడం, 23వ తేదీన స్వామి వారి ఊరేగింపు, ఉదయం 9గంటలకు నిప్పుల గుండం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### వేంకటేశ్వర కల్యాణం

**అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ):** మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. వేదమంత్రోత్సరణ నడుమ స్వామి కల్యాణ క్రతువు ప్రక్రియ జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ పర్యవేక్షించారు.

### అడ్‌హక్ కమిటీ ఎన్నిక

**మణుగూరుటౌన్:** మున్సిపాలిటీలోని చిన రాయిగూడెం సమ్మక్క–సారక్క ఇసుక ట్రైబల్ సొసైటీ సభ్యుల మధ్య డీసీఓ అధికారులు సమక్షంలో శనివారం అడహక్ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ మేరకు గతంలో సొసైటీ నిబంధనల ప్రకారం ముగ్గురు కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా.. రెండు వర్గాల నుంచి నలుగురు పోటీకి రావడంతో ఎన్నిక అనివార్యమైంది. ముగ్గురు సభ్యులకు 109 మంది ఏకగ్రీవంగా, ఒక సభ్యురాలికి ఏ విధమైన మద్దతు లభించకపోవడంతో సొసైటీ సభ్యులు ప్రతిపాదించిన ఆ ముగ్గురిని అడహక్ కమిటీ సభ్యులుగా సొసైటీ సభ్యుల నడుమ సంతకాల సేకరణతో తీర్మానించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ మనీషా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగా నెల రోజుల్లో అడహక్ కమిటీలోని ముగ్గురు సభ్యులు సొసైటీకి ఎన్నిక నిర్వహించి నూతన సొసైటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం డీసీఓ అధికారులు అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్‌ఆర్ హనుమాన్ పర్యవేక్షణలో పూర్తవ్వగా సమావేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నర్సింహారావు

**మణుగూరురూరల్:** బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా అక్కి నర్సింహరావు, మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా దేగల సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన నర్సింహారావుకు, దేగల సంపత్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### 200 రోజులు పని ఇవ్వాలి

**బూర్గంపాడు:** ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం సారపాకలోని ఉపాధి హామీ పనిప్రాంతంలో కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. ఈ పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**మణుగూరుటౌన్:** సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రామానుజవరంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సులోచన శిబిరానికి వచ్చిన 102 మంది ప్రజలకు వివిధ రోగాలకు మందులు అందజేసి వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మ్యాట్రిన్ షారోన్, రూప, రాము, పంచాయతీ కార్యాలయ సిబ్బంది రమేశ్ తదితరులు ఉన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**అశ్వారావుపేటరూరల్:** మండల పరిధిలోని వినాయకపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త వేల్పుల కిశోర్ భార్య రూప(25) కరెంట్ షాక్‌కు గురై మృతి చెందగా.. ఆమె మృతదేహాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించారు. ఇదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ పొట్టా రాజులు కంటికి గాయం కాగా, చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాటి రవికుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంకత మల్లికార్జున్‌రావు, బెల్లం వెంకటేశ్వరరావు, జక్కుల రాంబాబు, మల్లి పాల్గొన్నారు.

# ఆదివాసీల కల్పవృక్షం.. ఇప్ప చెట్టు

- గిరిజన గ్రామాల్లో ఇప్పపూల సువాసన
- వేకువజామునే పూల సేకరణకు అడవుల్లోకి..
- పలు విధాలుగా వినియోగం.. అమ్మకం



ఇప్పపూలను ఏరుతున్న ఆదివాసీలు



పర్ణశాల ఆలయం ఎదుట ఇప్పపూలు విక్రయిస్తున్న మహిళలు

**మండల వ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి నెలాఖరు నుంచి మే నెల చివరి వరకు విప్ప పూల సీజన్. అడవుల్లో ఆదివాసీలు వేకువ జామునే విప్ప చెట్ల కిందకు వెళ్లి పూలు ఏరుకునే పనుల్లో నిమగ్నమవుతున్నారు. దీంతో అడవుల్లో ఆదివాసీల సందడి మొదలైంది.**

**దుమ్ముగూడెం:** మండలంలో విప్పపూల సందడి కోలాహలంగా సాగుతుంది. తెల్లవారుజామునే చెట్ల కిందికి చేరుకుని తెల్లటి విప్ప పూలను ఆదివాసీలంతా ఏరుకుంటారు. ఉదయం 9, 10 గంటలకల్లా తిరిగి గ్రామాలకు చేరుకుని పాత చీరలు లేక చాపల తడికలపై ఉంచి రోడ్లపై ఆరబెడతారు. విప్పపూలు ఆదివాసులు తమ ఇళ్ల ముందు ఆరబోయగా మంచి సువాసనలు వెదజల్లుతూ ఉంటాయి.

సండే స్పెషల్

**ఎన్నో ప్రయోజనాలు.. ఆర్థిక ఊతం**

ఇప్పపువ్వుతో ఎంతో ఆదాయం గిరిజనులకు సమకూరుతోంది. ప్రస్తుతం కిలో ఇప్పపువ్వు రూ.30 ధర పలుకుతుంది. ఏడాదికి ఒక్కో చెట్టు నుంచి 150 కేజీల పువ్వులను, సుమారు 80 కిలోల విత్తనాల దిగుబడి వస్తుంది. సేకరించిన పూలను ఎండబెట్టి శుభ్రపరచుకుని గంపలలో ఆదివాసీలు దాచుకుంటారు. అయితే, విప్ప పూలతో ఆరోగ్యకరమైన ఒరిజినల్ గుడుంబాను, నాటు సారాను ఆదివాసులు సొంతంగా తయారు చేసుకుని సేవిస్తుంటారు. వారు తయారుచేసిన విప్పపూవ్వు సారాను భూమిలో పాతిపెట్టి తమకు బాగా కావాల్సిన బంధువులకు, స్నేహితులకు గిఫ్ట్‌గా అందజేస్తుంటారు. మిగిలిన ఇప్పపువ్వును జీసీసీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుంటారు. ప్రతి ఏడాది పూలు కొనుగోలు రేట్లను ప్రభుత్వ రంగ సంస్థ జీసీసీ గిట్టుబాటు ధరలతో ఆదివాసీల వద్ద నుంచి కొనుగోలు చేస్తోంది. మండలంలోని మండల సరిహద్దు గ్రామాల ఆదివాసీలు ఇప్పపువ్వుల సీజన్‌లో మరే పనికి వెళ్లక పోవడం ఇప్పపువ్వుకు వారిచ్చిన ప్రాధాన్యతను, ఆర్థిక కోణాన్ని తెలియజేస్తోంది.

**ఇప్పపూలతో స్వీట్లు..**

ఎండబెట్టిన విప్పపూలతో ఆదివాసీలు రకరకాల స్వీట్‌లను సొంతంగా తయారు చేసుకుంటారు. అలాగే అప్పటికప్పుడు తినడానికి వేడిగా, దోరగా వేయించుకొని చిరుతిల్లుగా స్వీకరిస్తుంటారు. ఇప్ప పువ్వులతో హల్వా, లడ్డూ, ఇప్ప పువ్వు గారెలు, గుగ్గిల్లు, కేక్‌లలో తయారుచేసుకుని తింటారు. కాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రాచుర్యం పొందిన ఇప్ప పువ్వు టీని తయారు చేస్తున్నారు.

**మానవజాతికి ఔషధం**



ఆదివాసీల మనుగడకు కారణమైన ఇప్పచెట్టును కల్పవృక్షంగా కొలుస్తారు. ఇప్పపువ్వు మానవజాతికి మంచి ఔషధం. ఆనాటి మానవుల ఆకలి తీర్చటమే కాకుండా అల్సర్ రానివ్వకుండా చూడటం, మోకాళ్ల నొప్పులు, ఒంటిపై నిగారింపు, మలబద్దకం ఏమాత్రం రానివ్వకుండా చూడటం, మనిషిలో చురుకుదనం పెంచడం తదితర సందర్భాల్లో ఇప్పపువ్వు తనదైన పాత్ర పోషిస్తోంది. ప్రపంచ మానవాళికి దివ్యమైన ఔషధం. ఈ చెట్ల వలన భూసారం పెరుగుతుంది.

– కోమరం దామోదరరావు, ఆదివాసీ గిరిజన నాయకుడు

**సమావేశంలో చెట్ల కేటాయింపు..**

ప్రతీ ఏడాది ఇప్పపూల సీజన్‌లో జరిగే పూల సేకరణకు బుట్టలు, గంపలు, బస్తాలు, కావిళ్ళతో పిల్లా, పాపలతో కుటుంబాలు విప్పచెట్ల కింద వాటి పూలు ఏరుకుంటారు. చెట్లు ఆకు రాల్చి మొగ్గ తొడుగుతున్న సమయంలోనే ఆదివాసీలంతా సమావేశమవుతారు. అందులో ఎవరికి ఏ చెట్లు అని నిర్ధారించి కేటాయిస్తారు. ఆపై వారికి కేటాయించిన చెట్ల కింద ముళ్లపొదలు, ఆకులు చెత్తా చెదారాన్ని శుభ్రం చేసుకుంటారు. తెల్ల రంగుల్లో కనపడే పూలు మసక చీకట్లోనైనా కనపడే విధంగా చెట్టు కింద శుభ్రం చేసుకుంటారు. ఈ పద్ధతులు దశాబ్దాల కాలంగా సంప్రదాయంగా వస్తున్నాయి.

**శ్రీరాముడి ప్రసాదంగా ఇప్పపువ్వు**

సీతారామ చంద్రస్వామి వారు వనవాస కాలం సమయంలో అడవిలో లభించే ఇప్పపూలను ఆహారంగా తీసుకునే వారని నానుడి. దీంతో పర్ణశాల సీతారామ చంద్రస్వామి ఆలయం, భద్రాచలం ఆలయం దగ్గర ఆలయాలకు వచ్చే భక్తులకు విప్పపువ్వును విక్రయిస్తుంటారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఆలయాలకు వచ్చే భక్తులు శ్రీరాముడి ప్రసాదంగా వీటిని కొనుగోలు చేసి తీసుకుని వెళ్తుంటారు. శ్రీరాముడికి అతి ప్రీతిపాత్రమైన ప్రసాద నైవేద్యంగా పరిగణించడంతోపాటు.. ఇప్పపువ్వు మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైనదిగా చెబుతుంటారు. దీపారాధనకు ఉపయోగించే ఇప్ప నూనె లీటరు ధర రూ.100కు పైమాటే పలుకుతుంది.

# క్లోరినేషన్ సమస్యకు చెక్!

- వాటర్ ట్యాంకుల మెట్ల నిర్మాణానికి నిధులు
- చొరవ చూపిన కలెక్టర్



కరకగూడెం: మెట్ల ఏర్పాటుకు నిధులు మంజూరైన లక్ష్మీపురం వాటర్ ట్యాంక్

**కరకగూడెం:** మండలంలోని పలు ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులకు మెట్లు లేక క్లోరినేషన్ ప్రక్రియ వెనుకబడడం.. ఆపై సురక్షిత నీరు ప్రజలకు అందకపోవడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం క్లోరినేషన్ ప్రక్రియకు అవసరమై ఏర్పాట్లకు కలెక్టర్ నిధులు కేటాయించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకృష్ణ 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు.

క్లోరినేషన్ సరిగా జరగకపోవడం, కలుషిత నీటి వినియోగం వల్ల పలు ఆరోగ్య సమస్యలు వెలుగులోకి రావడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. వాటర్ ట్యాంకులకు మెట్ల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాకు అవసరమైన పైప్‌లైన్‌లు, మోటర్ల ఏర్పాటుకు కూడా నిధులు కేటాయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత, వాటర్ ట్యాంకులు క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయడం ద్వారా నీటి స్వచ్ఛత నిర్ధారణ అవుతుంది.

**మొత్తం రూ.24 లక్షలు..**

మండల పరిధిలోని భర్లగూడెం, వెంకటాపురం, భట్టుపల్లి, లక్ష్మీపురం, పద్మాపురం, చొప్పల గ్రామాల్లో ఒక్కో వాటర్ ట్యాంకుకు రూ.3 లక్షల చొప్పున 18 లక్షలు, మొగిలితోగు గ్రామంలో నూతన బోరు, మోటార్‌కు రూ.4 లక్షలు, విప్పగుంపులో పైప్‌లైన్ నిర్మాణానికి రూ.2 లక్షల రూపాయలు మొత్తం రూ.24 లక్షల డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులను కలెక్టర్ కేటాయించారు. అలాగే పలు చోట్ల వాటర్ ట్యాంకుల మెట్లకు మరమ్మతులు చేపట్టనున్నారు.

# సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

**అశ్వారావుపేటరూరల్:** పంటల సాగులో అన్నదాతలు సస్య రక్షణ పద్ధతులను పాటించాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ పి.శ్రీలత, డాక్టర్ డి.ప్రవంతి సూచించారు. శనివారం మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పంట సాగులో మెళకువలు, సాగు ఖర్చు తగ్గించుకునే విధానం, రసాయనిక ఎరువుల వాడకం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ శివరాంప్రసాద్, పశు సంవర్థకశాఖ అధికారిణి డాక్టర్ స్వప్న, ఏఈఓలు నార్లపాటి రవీంద్ర, ఆరేపల్లి సతీష్, కార్యదర్శి అలివేలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

**గుండాల:** సీజెంటా మొక్కజొన్న విత్తనాల ద్వారా రైతాంగానికి అధిక దిగుబడి లభిస్తుందని సీజెంటా కంపెనీ దక్షిణాది డీఎం జగదీష్ దాస్ తెలిపారు. శనివారం గుండాల మండల కేంద్రంలో సీజెంటా మొక్కజొన్న విత్తనాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో మొక్కజొన్నలో అత్యధికంగా సీజెంటా ఉత్పత్తి సాధిస్తుందన్నారు. రైతాంగం మొక్కజొన్న సాగులో మెలకువలు తీసుకుని అధిక దిగుబడి పొందాలని కోరారు. అనంతరం అధిక దిగుబడి సాధించిన రైతులను సన్మానించి ప్రశంసపత్రం అందించారు. కార్యక్రమంలో మానాల వెంకటేశ్వర్లు, మానాల ప్రణీత్, పీఎం మహేష్, డీఎం రాంభూపాల్, పీఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం డివిజన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిష్టి బొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడారి ప్రదీప్ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో బీహార్ దర్భంగాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ అడ్డుకుని కేసు నమోదు చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అడ్డుకోవడం బీజేపీ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. రాహుల్ గాంధీపై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే కొట్టి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుధీర్ కుమార్, అరుణ్‌రాజ్, ప్రవీణ్, జితేంద్ర, అనిల్, మణికంఠ, నాగరాజు, సాయి, రాజు, సాయి భార్గవ్, రేవంత్, సాయిరాం పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తారురోడ్డు, బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరుటౌన్:** మండలంలోని బుగ్గ పంచాయతీలో ఖమ్మం తోగు వరకు రూ.5.25కోట్ల వ్యయంతో చేపట్టనున్న తారు రోడ్డు, బ్రిడ్జి పనులకు శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్రూం లకు రూ.55.40లక్షల వ్యయంతో పూర్తి చేసిన డబల్‌బెడ్రూం నిర్మాణాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత బుగ్గ గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బుగ్గ పంచాయతీలో అధికారులతో ప్రజల సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరామర్శలు చేపట్టారు. మాట్లాడుతూ.. తాను దత్తత తీసుకున్న బుగ్గ, ఖమ్మం తోగు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల అధికారులు, మండల నాయకులు నవీన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మంత్రి తుమ్మలకు వినతి

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషాతో కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామానుజవరం లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతుల వల్ల సరిగా సాగునీరు అందడం లేదని, బాగుచేస్తే ఈ ప్రాంతంలోని సుమారు 400ఎకరాలకు సాగునీరు అంది పంటలు సమృద్ధిగా పండుతాయని వివరించారు. ఈ విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించి లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# మెరుగైన వైద్యసేవలు అందించాలి



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

**మణుగూరురూరల్:** పినపాక నియోజకవర్గ ప్రజలందరికీ మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆస్పత్రి వైద్యులకు సూచించారు. శనివారం ఆయన ఆస్పత్రిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. రోగులను పరామర్శించి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యసేవలు కుంటుపడ్డాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తిరిగి వైద్యసేవలను మెరుగు పర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, వైద్యులపై ఉందన్నారు. రోగులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు అక్కి నర్సింహరావు, వేర్పుల సురేష్, ముద్దంగుల కృష్ణ, యాదగిరిగౌడ్, ఏనిక ప్రసాద్, రామకోటి, జావిద్ పాషా, యువజన నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కామరాజు జాతర



గిరిజనుల పొర్లు దండాల నడుమ దేవతలను తోడుకొని వస్తున్న దృశ్యం

**చర్ల:** మండలంలోని పెదమిడిసిలేరులో శనివారం గడి కామరాజు జాతర వైభవంగా ప్రారంభమైంది. గిరిజన తెగకు చెందిన పాయం, బెండబోయిన, పడిగ, గొంది, మెండు, పూనెం ఇంటి పేర్లు గల కుటుంబాల వారు ఏళ్ల తరబడిగా ఈ జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ జాతరలో భాగంగా తొలిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం పూజారులు గుట్ట దేవతను పెదమిడిసిలేరులోని గుడి వద్దకు తోడుకొని రాగా గిరిజనులు పొర్లు దండాలు పెడుతూ దేవతలకు స్వాగతం పలికారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి దేవతలకు గంగాస్నానం ఆచరింపజేశారు. ఈ కార్యక్రమంలో తలపతి బెండబోయిన లక్ష్మీనారాయణ వడ్డేలు పాయం లక్ష్మీనారాయణ, పాయం జోగయ్య, బెండబోయిన నాగేశ్వారవు, బెండబోయిన బాలయ్య, లక్ష్మయ్య, పాపయ్య, నారాయణ, పూనెం శ్రీను, పూనెం సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- దిగుమతులు లేవు.. లారీలు లేవంటూ నిరాకరణ
- వేచిచూస్తున్న సమయంలో వర్షాలు
- తప్పని పరిస్థితుల్లో ప్రైవేటుకు విక్రయం



వర్షానికి తడిసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో ఎత్తి మరోచోటుకు మారుస్తున్న దృశ్యం

**మణుగూరుటౌన్:** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలులో జాప్యం జరుగుతుండటంతో ధాన్యపు రాశులు ఒక వైపు వర్షానికి తడుస్తూ.. మరోవైపు ఎండకు ఎండుతున్నాయి. మద్దతు ధర రాక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీలో పలు చోట్ల సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా, తరచూ కురుస్తున్న వర్షంతో కల్లాల్లో పట్టాలు కప్పినా ధాన్యం తడిసి ముద్దవుతున్నాయి. దీంతో ఆ ధాన్యం కూలీలను పెట్టి ఆరబోసుకోవడం మళ్లీ వర్షం రావడం కూలీలతో ఆరబెట్టడం.. పరిపాటిగా మారింది. ఇటు సొసైటీ కొనుగోళ్లలో ఆలస్యం జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యాపారులకే విక్రయం..**

మణుగూరులో అధిక శాతం రైతులు కేఎన్ఎం-1638 రకం పంట సాగు చేశారు. ఈ రకం దిగుమతికి మిల్లర్లు ఆసక్తి చూపకపోవడంతో కొనుగోలుపై సొసైటీ సభ్యులు ఎటూ తేల్చలేకపోయారు. దీంతో కొన్ని రోజులు రైతులు వేచి చూడగా.. ఈలోపు వర్షాలు పడి ధాన్యం తడిసి ముద్దయింది. ఈ పరిస్థితుల్లో రైతులు వ్యాపారులకే ధాన్యం విక్రయించుకున్నారు. ఇతర రకాల ధాన్యం కొనుగోళ్లు కూడా సవ్యంగా సాగడం లేదు. మిల్లర్ల కేటాయింపు, లారీల దిగుమతి ఆలస్యంతో కల్లాల్లో ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ కొనుగోలు చేయక, వ్యాపారులకు తక్కువకు విక్రయించుకోలేక వర్షానికి తడుస్తున్న ధాన్యాన్ని కూలీలను పెట్టి ఆరబోయలేక అన్నదాతతు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**లారీలు పంపడం లేదు**

ధాన్యం.. కొనుగోలు కేంద్రానికి తెచ్చి 25 రోజులు అవుతోంది. వర్షానికి తడవడం, తేమ శాతం అధికంగా ఉందని చెబుతున్నారు. ఈ రోజు రేపు వస్తాయి లారీలు వస్తున్నాయి అంటూ దాటవేస్తున్నారు. వర్షాలకు పట్టాలు వేసినా ధాన్యం తడుస్తున్నాయి. లారీకి ధాన్యం ఎత్తడానికి ముఠా లేరంటే పక్క మండలాల నుంచి రూ.2వేలు పెట్టి తెప్పించినా లారీలకు ఎత్తడం లేదు.

– రామచందర్, రైతు, గాంధీబొమ్మ సెంటర్

**సాఫీగానే కొనుగోళ్లు..**

మండలంలో పగిడేరు గ్రామంలో అధికంగా పంట సాగు చేశారు. సొసైటీల ద్వారా కొనుగోలు జరుగుతోంది. వర్షాల వల్ల తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరబోసిన తర్వాత కొనుగోలు చేస్తున్నారు. లారీల కేటాయింపులో కొంత ఆలస్యం జరుగుతున్నది నిజమే. సమస్య పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్నాం. సమస్య త్వరితగతిన పరిష్కరిస్తాం.

– ఏడీఏ తాతారావు